క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే కొడాలి నాని దంపతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గుడివాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని) దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాని దంపతులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందించారు.

మద్యం విక్రేత అరెస్టు

ముదినేపల్లి రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని సింగరాయపాలెం సెంటర్లో రాజస్థాన్‌కు చెందిన మిఖితా అనే వ్యక్తి తన టీస్టాల్‌లో కొంతకాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్థానికులు అందించిన సమాచారం మేరకు దాడి చేసి మిఖిత నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వడాలిలో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకుమార్ చెప్పారు. వీరి నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పేకాట, కోడిపందేలు, ఇతర జూదాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను సత్వరమే పూర్తిచేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని పెదపాలపర్రు, గురజ, జగనన్న కాలనీల్లో బుధవారం పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలు పూర్తి చేసిన దశలను బట్టీ ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో మౌలిక వసతులను సైతం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు కాలనీల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగనన్న ఆశయం మేరకు నిర్మాణాలు సత్వరమే పూర్తిచేసి సొంతింటి కలను నెరవేర్చుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, గంటా కోటేశ్వరరావు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

మండవల్లి: మండవల్లి ఎస్సీ శ్మశాన వాటికలో సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యాన బుధవారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శ్మశానంలో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు లేకుండా, శ్మశానానికి వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

549 మందికి వైద్య పరీక్షలు

గుడివాడ టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాలు పట్టణంలోని 1వ వార్డు, 15వ వార్డుల్లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వక్తలు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తున్నారన్నారు. ఈ శిబిరాల్లో 15వ వార్డు సచివాలయంలో పురుషులు 297, స్త్రీలు 252, మొత్తం 549 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ రమణ, డాక్టర్ ఎల్ సుమ చౌదరి, డాక్టర్ కిరణ్ కుమార్ పరీక్షలు నిర్వహించారు. 1వ వార్డు నాగవరప్పాడు శిబిరంలో పురుషులు 258, స్త్రీలు 192, మొత్తం 450 మందికి డాక్టర్ కృష్ణగిరీష్, డాక్టర్ జోగానంద్, డాక్టర్ లావణ్య లు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ మేనేజర్ ఐ శ్రీనివాసులు, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ నాగేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

388 మందిని బైండోవర్ చేశాం



కైకలూరు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కైకలూరు నియోజకవర్గంలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి, డీఎస్పీ ఈ.శ్రీనివాసరావు ఆదేశాలతో గ్రామాల్లో ఇప్పటికే పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. కైకలూరు నియోజకవర్గంలో టౌన్ పరిధి మినహాయించి ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు కోడిపందేలు, పేకాట ఆడుతున్న 388 మందిని బైండోవర్ చేసి తహసీల్దారు వద్ద హాజరుపరచగా, పూచీకత్తుపై విడుదలయ్యారన్నారు. పది రోజుల వ్యవధిలో 19 పేకాట కేసులలో 99 మందిని అరెస్టు చేసి రూ.లక్షా 940 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఇటీవల కోడిపందేల శిబిరంపై దాడిచేసి 8 మంది జూదరులను అరెస్టు చేసి, రూ.2,760 నగదు, 3 కోడిపుంజులను పట్టుకున్నామన్నారు.

ఆణిముత్యాలను వెలికి తీయడమే లక్ష్యం



పోటీలను వీక్షిస్తున్న ఎంపీపీ, అధికారులు, ప్రజాప్రతినిధులు



పమిడిముక్కల హైస్కూల్‌లో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుప్రజ, ప్రజా ప్రతినిధులు



పెనమకూరులో జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న ఎంపీడీఓ స్వర్ణలత



మొవ్వలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు



మొవ్వలో క్రీడా పోటీల్లో తలబడుతున్న కోసూరు-చినముత్తేవి క్రీడాకారులు



మండవల్లి హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు

'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి పోటీలు ప్రారంభం

గుడివాడరూరల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహిస్తోందని ఎంపీపీ గద్దె పుష్పరాణి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం మండల స్థాయి కబడ్డీ పోటీలను మోటూరు జెడ్పీ పాఠశాలలో ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు గొర్రె వరలక్ష్మి, ఎంపీడీవో అనగాని వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు జనార్థనరావు, అనూల, స్నేహలత, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు, గ్రామ వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా..

పమిడిముక్కల: దేశం గర్వించతగ్గ క్రీడాకారులుగా యువత ఎదగాలని ఎంపీపీ కాసాని వేద సుప్రజ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను బుధవారం ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మట్టిలోని మాణిక్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, రాష్ట్ర రెడ్డిక, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు కంభపు రాంబాబు, శొంఠి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

తోట్లవల్లూరు: క్రీడలతో మానసికోల్లాసంతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని తోట్లవల్లూరు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల సందర్భంగా మండలంలోని పెనమకూరు జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని జాతీయ పతాకాన్ని స్వర్ణలత ఎగురవేశారు. విద్యార్థులు, యువకులు, బాలికలు ఉత్సాహంగా కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన టీములను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుభాష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బాలు, మణి, పాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మొవ్వ: గ్రామాల్లో మట్టిలో మాణిక్యాలాంటి క్రీడాకారులను వెలికి తీసి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిర పేర్కొన్నారు. మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధ రాజు, గ్రామ సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావులతో కలిసి ప్రారంభించారు. తొలి రోజైన బుధవారం కబడ్డీ పోటీలు ఉత్కంఠ వాతావరణలో సాగాయి. ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్ ముందుగా క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, పీడీలు ఏ రామారావు, బీవీ నాగశివ, కేకే చందు, పీ బసవయ్య, కే వెంకటేశ్వరరావులతో పాటు సచివాలయ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో 'ఆడుదాం ఆంధ్రా'

మండవల్లి: మండవల్లిలో మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద కబ్బడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. భైరవపట్నంలో క్రికెట్, లోకుమూడిలో ఖోఖో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి బాబ్జీ, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ ఎ.ఆనంద బాబు మాట్లాడుతూ యువతలో దాగిఉన్న ఆసక్తిని వెలికి తీయడానికి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రవేశపట్టినట్లు పేర్కొన్నారు.

కొల్లేరు గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్ కృషి

ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కైకలూరు: కొల్లేరు గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తెలిపారు. బుధవారం శృంగవరప్పాడు గ్రామంలో కొల్లేరు పెద్దలతో సమీక్షా సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ జయమంగళ మాట్లాడుతూ కేశినేని నానిని పొమ్మనలేక ఏ విధంగా పొగబెట్టారో అదే విధంగా టీడీపీ నుంచి చంద్రబాబు నేను బయటకు వచ్చేలా వ్యవహరించారన్నారు. ఆయనంత దుర్మార్గుడిని ఎక్కడా చూడలేదన్నారు. కొల్లేరు బిడ్డనైన తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి సీఎం జగన్ చక్కటి గౌరవాన్ని అందించారన్నారు. జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కొల్లేరు ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయం చేకూర్చాలని కొల్లేరు ప్రజలను కోరారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధిని పూర్తి చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కొల్లేరు గ్రామాల్లో బీటీ రోడ్లు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించామన్నారు. కొల్లేరులో వలసలను నివారించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ నాయకుడు ముంగర నరసింహారావు, పార్టీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు, సర్పంచ్ ఘంటసాల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఘంటసాల నాగమణి, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, గ్రామ పెద్దలు ఘంటసాల జగన్నాథం, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కలిదిండి: పేద, బడుగు వర్గాలకు సేవ చేయాలనే సంకల్పంతో యువా ఫౌండేషన్ పేరిట యువకులంతా ముందుకు వచ్చి దుస్తులు, దుప్పట్లు, రక్తదాన,, వైద్య శిబిరాలు, పండ్లు అందించి సేవలు అందించటం అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కొనియాడారు. కలిదిండి మార్కెట్ యార్డ్ లో బుధవారం యువా ఫౌండేషన్ 6వ వార్షిక మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే డీఎన్నార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వృద్ధులకు దుస్తులు, పండ్లు అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు చాన్ బాషా, పాము రవికుమార్, సంస్కృతిక విభాగ అధ్యక్షుడు బాబూరావు, మసీముక్కు వెంకటేశ్వరరావు, ద్రోణాద్రి ఫ్రాన్సిస్, మండల కో ఆప్షన్ సభ్యులు హాఫీజ్, గుడివాడ ఫణికుమార్, అబ్దుల్ నయీమ్, మహ్మద్ రహ్మతుల్లా, యువా ఫౌండేషన్ ఫౌండర్స్ పవన్, సింగంశెట్టి మణికంఠ, సింగిరెడ్డి వెంకటరమణ, బుసనబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వేగవంతం చేయండి

కైకలూరు: నియోజకవర్గంలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచించారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గం నాలుగు మండలాలకు చెందిన పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రాజెక్టు వర్క్ అధికారులతో పనులపై బుధవారం సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. అధికారులు త్వరగా పనులను పూర్తి చేయాలని కోరారు. కైకలూరు, ముదినేపల్లి ఎంపీపీలు అడవి కృష్ణ, రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు భత్రాజు శివాజీ, మోట్రూ ఏసుబాబు, పంచాయతీరాజ్ ఏడీ సురేష్, ఏఈ సాధిక్ పాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏడీ శాస్త్రి, ఏఈ నాగబాబు, ప్రాజక్టు వర్క్ ఏడీ కె.రవికుమార్ పాల్గొన్నారు.

ప్రాకార మండపం పనుల పరిశీలన

కలిదిండి: పాతాళ భోగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ప్రాకార మండపం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదేశించారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యాన బుధవారం నాయకులతో కలిసి ప్రాకార మండపం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు వడుప రామారావు, మసీముక్కు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేద్దాం



అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఐక్యత చాటుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడివాడ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రజలకు అంకితం చేస్తున్న సందర్భంలో పెద్ద ఎత్తున ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని నిబద్దతతో అమలు చేస్తున్న ఏకైక నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే అంబేడ్కర్ కీర్తిని ఇనుమడింపచేసేలా ఆయన స్థాయిని గుర్తించే రీతిలో విజయవాడ నడిబొడ్డున స్వరాజ్‌మైదానంలో నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జగన్ మోహన్‌రెడ్డికి అంబేడ్కర్ ఆశయాలపై ఉన్న శ్రద్ధను తెలియచేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, నందివాడ మండల ఎంపీపీ పెయ్యల ఆదాం, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, రూరల్ మండల కన్వీనర్ కారె జోసఫ్, మెండా కిరణ్ కుమార్, ఎం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ సెల్ జోనల్ కన్వీనర్ విక్టర్ పాల్, మాజీ ఎంపీటీసీ సుబ్బారావు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శులు పరిమె అమృతబాబు, విజ్జి కృపారావు, పట్టణ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, వెంపటి సైమన్, రాజేష్, సీహెచ్ జోషి తదితరులు పాల్గొన్నారు. స్థానిక 6వ వార్డు సచివాలయంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వార్డు ఇన్‌చార్జ్‌లు వెంపల అప్పారావు, దుడ్డు చిన్నా, జోగా నాగేశ్వరరావు, కోండ్రు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక 29వ వార్డు సచివాలయంలో వార్డు ఇన్‌చార్జ్ పోలాసి వాసు అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరు కావలసిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు.

గుడివాడ గుండెలో గుర్తుండిపోయేలా..!



బండలాగుడు పోటీలకు సిద్ధం చేసిన స్థలం

- సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం
- నేటి నుంచి ఎడ్ల పందేలు
- కొడాలి నాని, కొడాలి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం
- ఎన్టీఆర్ టూ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణ

సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం..



పోటీల్లో పాల్గొనే ఎడ్లతో పాటు ఎడ్ల యజమానులకు వారితో వచ్చే సహచరులకు ఇక్కడ అన్ని వసతులు సిద్ధం చేశాం. భోజన వసతులు కల్పిస్తున్నాం. ప్రజలు వీక్షించేందుకు పెద్ద ఎత్తున గ్యాలరీలు ఏర్పాటు చేశాం. అసౌకర్యం కలుగకుండా పోటీల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం.

-పాలడుగు రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు

గుడివాడటౌన్: సంక్రాంతి సంబరాలు గుడివాడ గుండెలో గుర్తుండిపోయేలా ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కళాకారులకు పుట్టినిల్లు అయిన గుడివాడ ప్రాంతం తెలుగు వారు గుర్తుంచుకునేలా అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీరామారావు, కైకాల సత్యనారాయణ వంటి పలువురు కళాకారులను జన్మనిచ్చిన ఈ ప్రాంతంలో తెరమరుగవుతున్న సంప్రదాయాలను వెలుగులోకి తెచ్చి వాటిని ప్రజలకు గుర్తుండిపోయేలా నిర్వహించనున్నారు.

ఎమ్మెల్యే కొడాలి నాని ఆధ్వర్యంలో..

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం అయింది. రైతులను ప్రోత్సహించేందుకు ఎన్టీఆర్ టూ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు స్థానిక లింగవరం రోడ్‌లోని కే కన్వెన్షన్ నగర్‌లో గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

ఎన్టీఆర్ టూ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో..

ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆయన సోదరుడు కొడాలి నాగేశ్వరరావు(చిన్ని) ఆధ్వర్యంలో 2016లో ఈ పోటీలను ప్రారంభించారు. దక్షిణ భారతదేశానికి చెందిన పలు ప్రాంతాల నుంచి ఒంగోలుజాతి ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ప్రతి ఏట పోటీల్లో పాల్గొంటున్న ఎడ్ల జతలు పెరగడంతో నిర్వాహణను ఈనెల 15 వరకు పొడిగించారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జరుగుతున్న ఈ ఎడ్ల బండలాగుడు ప్రదర్శన జిల్లా లోని అన్ని ప్రాంత ప్రజలను విశేషంగా ఆకర్షిస్తుంది.


పోటీలు ఇలా..

ఈ పోటీల్లో రెండు, నాలుగు, ఆరు పళ్ళు, సేద్య విభాగం, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తారు. స్థాయిని బట్టి 7, 10, 13, 17, 19, 22, 25 ఘనపుటడుగుల పొడవు గల బండలు లాగిస్తారు. సుమారు 1 ఘనపుటడుగు రాయి బరువు 85 కిలోలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బహుమతులు ఇవీ..

పోటీలో పాల్గొన్న జట్లకు 9 బహుమతులు ఉంటాయి. అధిక మొత్తం రూ.లక్ష నుంచి రూ.5 వేల వరకు 63 బహుమతులు రైతులకు అందజేస్తారు. ప్రతి విభాగంలోనూ 9 స్థానాలకు బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి జట్టుకు జ్ఞాపిక అందజేస్తారు. పోటీలో పాల్గొన్న రైతులకు, ఎడ్లకు ఏ విధమైన అసౌకర్యం కలుగకుండా ఇప్పటికే భారీ వసతులు ఏర్పాటు చేశారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రజలు ఈ పోటీలకు విశేషంగా హాజరు కావడం దీని ప్రత్యేకత.

'ఉపాధి' పనులపై ప్రజావేదిక



ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా పీడీ సూర్యనారాయణ, ఎంపీపీ, జెడ్పీటీసీ

తోట్లవల్లూరు: ఉపాధిహామీ పనులు పారదర్శకంగా, నాణ్యతగా జరిగే విధంగా అధికారులు, ఉపాధి సిబ్బంది చూడాలని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ సూచించారు. 2022-23 సంవత్సరాలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం ప్రశాంతంగా జరిగింది. 886 పనులను రూ.4.34 కోట్లతో నిర్వహించారు. భద్రిరాజుపాలెం, ఐలూరు గ్రామాల్లో కూలీల సంతకాలు, వేలిముద్రలు లేకుండా నగదు చెల్లించినట్లు తనిఖీ బృందం గుర్తించింది. రూ.56,778 నగదు రికవరీ చేయటంతోపాటు, రూ.5,300 జరిమాన కింద చెల్లించాలని పీడీ సూర్యనారాయణ ఆదేశించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, డ్వామా ఏఓ నాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారిణి శ్రీలత, ఏపీఓ వెంకటేశ్వర రెడ్డి, ఎస్ఆర్‌పీ చిన్నబ్బాయి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చట్టవిరుద్ధమైన పనులు నిర్వహిస్తే చర్యలు

పామర్రు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని సంప్రదాయ క్రీడలు ఆడుకోవాలని పామర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాకర్ బుధవారం తెలిపారు. పామర్రు పోలీస్‌స్టేషన్‌లో పామర్రు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ చట్టవిరుద్ధమైన పేకాట, కోడిపందాలు, గుండాట వంటి వాటికి వెళ్లకుండా సంప్రదాయక్రీడలను ఆడుకోవాలని అన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు పామర్రు, కూచిపూడి, పెదపారుపూడి మండల ప్రజలు ఈ సూచనలు పాటించాలన్నారు. ఎక్కడా కూడా కోడిపందాలు, పేకాట శిబిరాలకు అనుమతులు ఇవ్వలేదని అన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచి తరువాత ఆరునెలల కాలపరిమితికి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు పామర్రు సర్కిల్ పరిధిలో నేర ప్రవృత్తి గలవారిని 107 సెక్షన్ కింద 142 మందిని, 110 (ఇ) సీఆర్‌పీసీ కింద 270 మందిని, ఏపీ గేమింగ్ అక్ట్ కింద 25 మందిని, ఎక్సైజ్ అక్ట్‌కింద 18 మందిని ఈ ఏడాదిలో అరెస్టులు చేసి బైండోవర్ చేశామని చెప్పారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

పెదపూడి(మొవ్వ): గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అండర్-17 బాల బాలికల కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థ ఫౌండర్ గొట్టుపాటి సాయి బుధవారం తెలిపారు. ఈ కబడ్డీ టోర్నీని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రారంభిస్తారని, 13వ తేదీన జరిగే బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు సినీహీరో సంపూర్ణేష్ బాబు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక యువత విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

21 మద్యం బాటిళ్లు స్వాధీనం

తోట్లవల్లూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని వల్లూరుపాలెంలో జరిగింది. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో అక్రమమద్యంవిక్రయాలకు పాల్పడుతున్న ఎస్.రాంబాబుని బుధవారం రాత్రి అరెస్టు చేసి 21 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి. విశ్వనాథ్ తెలిపారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

పెదపారుపూడి: సంకాంత్రి పండుగా పురష్కరించుని సంప్రదాయ క్రీడాలను ప్రోత్సాహంచాలని ఎస్ఐ పల్లా నాగకల్యాణి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగా సందర్భంగా సంప్రదాయం ఆటలను ఆడుకోవాలని, చట్టవిరుద్ధమైన పేకాట, గుండాట, పేకాట, కోడి పందేల నిర్వహణకు ఏటు వంటి అనుమతులు లేవన్నారు. జూదాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని కోర్టుకు తరలిస్తామన్నారు. పేకాట, కోడి పందాలు పాల్గొనవద్దని మండల ప్రజలకు సూచించారు.

యువత జూదాలకు దూరంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: యువత జూదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకట్‌కుమార్ సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జూదాలను అరికట్టేందుకు తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐతో మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కోడిపందేలు, పేకాట నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో 122 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. తహసీల్దార్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, యువత జూదాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎంపీడీవో పి.మల్లీశ్వరి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోండి

సీఐ కిషోర్‌బాబు



పమిడిముక్కల: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, సంక్రాంతికి ఊరెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఊరెళ్లే ముందు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, సోషల్ మీడియాలో ఊరెళుతున్నట్లుగా పోస్టు చేయకూడదని తెలిపారు. బంగారు, వెండి ఆభరణాలు, నగదు బ్యాంక్ లాకర్లలలో భద్రపరచుకోవాలన్నారు. సెక్యూరిటీ, సెన్సార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉండే తాళం అమర్చుకోవాలని అన్నారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని, అనుమానాస్పద వ్యక్తులు కలిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, తప్పనిసరిగా డయల్ 112కు కాల్ చేయాలన్నారు. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకొంటూ ఉండాలని తెలియజేశారు.